క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరి పాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు. మహిళలు ఉమాదేవి అమ్మవారిని కుంకుమతో అర్చించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

స్పందనకు నాలుగు వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 వేపగుంటలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై నాలుగు వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. పలు చోట్ల కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు విన్నవించారు.ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. జోన్–8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా ధనుర్మాస పూజలు


సింహాసనంపై వెంకన్న

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు విశేషంగా జరిగాయి. తెల్లవారుజామున సుప్రభాతసేవ, ఆరాధన నిర్వహించిన అనంతరం పాశుర విన్నపం నిర్వహించారు. వెంకన్న ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి సింహాసనంపై అదిష్టింపజేశారు. గోదాదేవిని అలంకరించారు. భక్తులు స్వామిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

మహిళలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలు అందజేస్తున్న దృశ్యం

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెం గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. భగవంతుడిని పల్లకీలో అదిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించి భక్తులకు భగవంతుడి దర్శన భాగ్యాన్ని కల్పించారు. అచ్యుతాపురం సీనియర్ అసిస్టెంట్ కూండ్రపు శ్రీను దంపతులు సమకూర్చిన చీరలను మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న 16 మంది మాతృమూర్తులకు పంపిణీ చేశారు.

మై భారత్ వికసిత్ 2047 పోటీలకు విశేష స్పందన


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన హర్షిత

బీచ్ రోడ్డు: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో సోమవారం బీచ్‌రోడ్డులోని యూత్ హాస్టల్స్‌లో నిర్వహించిన మై భారత్ వికసిత్ 2047 జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలకు యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని జిల్లా అధికారి మహేశ్వర తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.25వేలు అందజేస్తామన్నారు. జిల్లా నుంచి హర్షిత దేవగుప్తపు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆమె తెలిపారు.

సంక్రాంతి వచ్చిందె తుమ్మెద..

సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మల అలంకరణతో పలు పాఠశాలల్లో విద్యార్థులు సందడి చేశారు. భోగిమంటలు వేసి భోగిపళ్లతో వేడుక, హరిదాసు కీర్తనలు సంస్కృతికి అద్దం పట్టాయి. చిన్నారుల సందడితో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలుగు ప్రజల ఆచార సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.


భోగి మంట వేసి నృత్యాలు చేస్తున్న సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో అలరించారు. పాఠశాల ఆవరణలో భోగి మంట వేసి సందడి చేశారు. ఆటపాటల్లో మునిగితేలారు. విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో వేసిన రంగవల్లులు ఆలోచింపజేశాయి. హరిదాసు వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాను, ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు.

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. బొమ్మల కొలువు ఆకట్టుకుంది. గంగిరెద్దుల వాళ్ల వేషధారణల్లో అలరించారు. ఆటపాటలతో సందడి చేశారు. రంగవల్లులు గొబ్బెమ్మలు తీర్చిదిద్దారు. భోగిమంటలు కాచి సంబరపడ్డారు. రవీంద్రభారతి ఉత్తరాంధ్ర డీన్ కె.రమ్య, ప్రిన్సిపాల్ కె.స్వరూప పాల్గొన్నారు. ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు సందడిగా జరిగాయి. ప్రిన్సిపాల్ ఎన్.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక ఆర్కిడ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సోమవారం తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు, భోగి మంటలు, హరిదాసు కీర్తనలతో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ స్వామినాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


హరిదాసు వేషధారణలో విద్యార్థులు


ఆటలు ఆడుతున్న విద్యార్థినులు


భోగి మంట ముందు విద్యార్థులు




రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, పాఠశాల ప్రతినిధులు, సంప్రదాయ వస్త్రధారణలో స్ప్రింగ్స్ పాఠశాల చిన్నారులు

300 మంది రక్తనమూనాల సేకరణ

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫైలేరియా గుర్తింపులో భాగంగా ప్రత్యేక శిబిరం నిర్వహించారు. సబ్బవరంలో సోమవారం రాత్రి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్. ఎన్. ఆర్. చక్రవర్తి ఆధ్వర్యంలో ఆరు బృందాలతో 300కి పైగా రక్త నమూనాలు సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను అనకాపల్లి ల్యాబ్‌కు పంపించి అనంతరం ఫలితాలు వెల్లడించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలకు కీటక జనిత వ్యాధుల పై అవగాహన కల్పించారు. క్యూలెక్స్ దోమ కాటు వల్ల ఫైలేరియా, మెదడు వాపు జ్వరం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా నీటి డ్రమ్ములు, ఫ్రిజ్‌లు, రుబ్బురోళ్లు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సమస్య చెబితే.. నిలదీశారని ప్రచారం చేస్తారా!

వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు పరిధి విజినిగిరిపాలెంలో మూడు రోజుల కిందట ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు భూసమస్యపై నిలదీశారని వచ్చిన వార్తల్లో నిజం లేదని ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్టిపారేశారు. కేవలం సమస్యను ప్రజలు ముత్తంశెట్టి దృష్టికి తీసుకెళ్లారని స్పష్టం చేశారు. అడవివరంలో వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు మాట్లాడుతూ విజినిగిరిపాలెంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావును భూసమస్యపై నిలదీశారంటూ ఒక దినపత్రిక ప్రచురించడంలో వాస్తవం లేదన్నారు. భూసమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని, ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముత్తం శెట్టి చెప్పడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం మాట్లాడుతూ పంచగ్రామాల భుసమస్యకు నాటి టీడీపీ ప్రభుత్వమే కారణమని దుయ్యబట్టారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకునే వ్యక్తి ముత్తంశెట్టి అని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొలుసు గురునాథ్, లోగిశ మాధవరావు, లండ రమణ, తెడ్లపు మహేష్, మజ్జి అప్పలరమణ, ఆనంద్, ఎస్.అప్పారావు, కిషోర్‌రెడ్డి, వర్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొలుసు ఈశ్వరరావు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సింహాచలం నాయుడు(ఫైల్)

సబ్బవరం: సబ్బవరం మేజరు పంచాయతీ పరిధి కొత్తరోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. సబ్బవరం శివారు పెదనాయుడుపాలేనికి చెందిన రొంగలి సింహాచలంనాయుడు (59) కాకినాడ ఓఎన్జీసీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామం వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని సంతకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. కొత్తరోడ్డు వద్దకు వచ్చేసరికి పెందుర్తి నుంచి సబ్బవరం వైపు వస్తున్న స్కూటీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో సింహాచలంనాయుడు రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్ కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఉక్కు ఉద్యమం భావితరాలకు స్ఫూర్తి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందనిఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1061వ రోజు సంస్థకు చెందిన ఆర్‌ఎంహెచ్‌పీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. సరిపల్లి ఇసుక రీచ్, గర్భం మాంగనీస్ గనుల లీజును పునరుద్ధరించాలనే డిమాండ్‌తో విజయనగరం జిల్లాలోని డిస్ట్రిక్ట్ మైనింగ్ అండ్ జూలాజికల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి నాయకులు తరలివెళ్లారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

పాత చలానాలు రద్దు చేయాలి

సీతమ్మధార : ఆటో డ్రైవర్లపై ఉన్న పాత చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) నాయకులు ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ డ్రైవర్లపై వేల రూపాయల జరిమానా వేసే జీవో నంబర్ 21ను రద్దు చేయాలన్నారు. వ్యాన్లు, లారీలు, కార్లు, జీపులకు 30 శాతం ట్యాక్స్ పెంచుతూ విడుదల చేసిన జీవో నంబర్ 31ని ఉపసంహరించుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఆటో డ్రైవర్లకు జగనన్న ఇల్లును వెంటనే మంజూరు చేయాలన్నారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలన్నారు.

కాలుష్య రహిత విశాఖ లక్ష్యం

సైకిల్‌పై విధులకు హాజరైన జీవీఎంసీ కమిషనర్


బంగ్లా నుంచి ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత విశాఖ లక్ష్యంగా.. పర్యావరణ పరిరక్షణ దిశగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లారు. విధులు అనంతరం నడక మార్గాన ప్రధాన కార్యాలయం నుంచి బంగ్లాకు చేరుకున్నారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారంలో ఒక రోజు నగర ప్రజలు తమ సొంత వాహనాలు విడిచి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు.

సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా ఏయూ అభివృద్ధి


మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య కె.సమత

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వర్సిటీ అధికారులు, డీన్‌లతో ఆమె మాట్లాడారు. విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనిచేస్తున్నారని, ప్రతి కుటుంబం నుంచి ఉన్నత విద్యావంతులు రావాలని ఆశిస్తున్నారని చెప్పారు. దీనిని సాకారం చేసే దిశగా విశ్వవిద్యాలయంలో పటిష్ట బోధన వ్యవస్థతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఇటీవల ఏయూను సందర్శించిన బంగ్లాదేశ్ దౌత్య అధికారి ఏయూలో పటిష్ట బోధన వ్యవస్థను చూసి ప్రశంసించారని ఆమె చెప్పారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం అభివృద్ధికి దోహదపడే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి సమర్థవంతంగా నిర్వర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియలో అందరి సహకారం, సూచనలు స్వీకరించి సమష్టిగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రగతికి బాటలు వేస్తామని ఆమె చెప్పారు.

ఆంధ్ర మహాభారతం పద్యాలాపన


విద్యార్థులతో పద్యాలు ఆలపిస్తున్న సంగీతం టీచర్లు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆంధ్ర మహా భారతంలోని 108 పద్యాల ఆలాపన కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి 30వ ఆరాధనా మహోత్సవం పేరిట శ్రీకంచి కామకోటి శంకరమఠం ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు బ్యాచ్‌లుగా గత 3 నెలలుగా పద్యాలాపనపై పెద్ద ఎత్తున శిక్షణ ఇచ్చారు. అనంతరం సోమవారం 108 పద్యాలను విద్యార్థులు టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఆలపించి అలరించారు. 15 ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి


బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకుంటున్న సాయిరామ్

పరవాడ: తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు తెలుగు భాషను రక్షించుకోవాలని పరవాడ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి, కవి, ఎం.ఎస్.ఎస్ సాయిరామ్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన తెలుగు మహాసభల్లో పాల్గొన్న రచయిత సాయిరామ్ కవితా నీరాజనంలో భాగంగా తెలుగు భాష గొప్పతనం గురించి వివరించారు. అనంతరం సాయిరామ్‌ను డాక్టర్ ఎస్.ఎస్.కొల్లూరి, హెచ్.టి.పద్మజ ఘనంగా సత్కరించి గోల్డ్ మెడల్, షీల్డ్, ప్రశంసా పత్రాలు అందజేశారు. పరవాడ పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో సాయిరామ్‌ను ఆస్పత్రి వైద్యులు డాక్టర్ హారిక, డాక్టర్ జయశ్రీ కరిష్మా, నన్నయ్య విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ తరపట్ల సత్యనారాయణ తదితరులు సాయిరామ్‌ను అభినందించారు.

వెంకటాద్రికి ధనుర్మాస శోభ


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారికి విశేష పూజలు జరిపారు. తిరుప్పావై 23వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామి,గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఘనంగా కుంకుమ పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు తదితరులు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం ఆర్టీసీ లేఅవుట్‌లో కొలువుదీరిన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలోని కనకమహాలక్ష్మికి కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి విశేష అభిషేకాలు చేసి అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారిని రథంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన


రంగనాథస్వామి గాథ నృతరూపకం



భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార ఆవాస విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా అలరించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ నృత్యాలకు సంగీతం, అభినయం మేళవించడంతో అందరినీ కట్టి పడేశాయి. భక్తికి కులం కంటే గుణమే ప్రధానమని తెలియజెప్పే ముని వాహనసేవ తిరుప్పావై – రంగనాథస్వామి గాథ నృత్యరూపకం ఎంతగానో అలరించింది. మణిపూర్ సరస్సులు, పవిత్ర స్థలాల అందాలను వర్ణిస్తూ సంప్రదాయ నృత్యం కళాత్మకంగా సాగింది. మయూరం విశ్వనాథ శాస్త్రి స్వరపరిచిన కీర్తనకు విద్యార్థులు చేసిన భరతనాట్యం లయాత్మకంగా సాగింది. సంక్రాంతి సంబరాల జానపద నృత్యం కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

కనక మహాలక్ష్మికి విశేష అభిషేకాలు



డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 26వ రోజు సోమవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్త రోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2500 మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.